أصول العقيدة ـ تلغو

# విశ్వాస మూల సూత్రాలు

جمعية الدعوة والإرشاد وتوعية الجاليات بالزلفي

56

هاتف: ٠١٦ ٤٢٣٤٤٦٦ ـ فاكس: ٠١٦ ٤٢٣٤٤٧٧

جمعية الدعوة بالزلفي

# విశ్వాస మూల సూత్రాలు

## أصول العقيدة – تلغو


جمعية الدعوة والإرشاد وتوعية الجاليات في الزلفي

Tel: 966 164234466 - Fax: 966 164234477

# أصول العقيدة

أعده وترجمه إلى اللغة التلغو

**جمعية الدعوة والإرشاد وتوعية الجاليات بالزلفي**

الطبعة الخامسة: ٩/ ١٤٤٢هـ

ح **المكتب التعاوني للدعوة والإرشاد وتوعية الجاليات بالزلفي**

فهرسة مكتبة الملك فهد الوطنية أثناء النشر

**المكتب التعاوني للدعوة والإرشاد وتوعية الجاليات بالزلفي**

أصول العقيدة –

الزلفي، ١٤٣٠هـ

ردمك:٧-٤٨-٢١٩-٩٩٦٠

(النص: لغة تلغو)

١- العقيدة الإسلامية ٢- التوحيد أ- العنوان

ديوي ٢٤٠ ١٩/٤٢٨٥

رقم الإيداع: ١٩/٤٢٨٥

ردمك: ٧-٤٨-٢١٩-٩٩٦٠

# విషయసూచిక


| | |
|---|---|
| 5 | తౌహీద్ దాని రకాలు |
| 6 | తౌహీదె రుబూబియత్ |
| 7 | తౌహీదె ఉలూహియత్ |
| 9 | తౌహీదె అస్మా వ సిఫాత్ |
| 11 | లాఇలాహ ఇల్లల్లాహ్ భావం |
| 12 | లాఇలాహ ఇల్లల్లాహ్ ఘనత |
| 14 | లా ఇలాహ ఇల్లల్లాహ్ నిబంధనలు |
| 20 | ముహమ్మదుర్ రసూలుల్లాహ్ భావం |
| 22 | విశ్వాసం దాని మూలసూత్రాలు |
| 23 | అల్లాహ్ పై విశ్వాసం |
| 29 | దూతలపై విశ్వాసం |
| 30 | గ్రంథముల పై విశ్వాసం |
| 31 | ప్రవక్తల పై విశ్వాసం |
| 33 | పరలోక విశ్వాసం |
| 33 | మంచి, చెడు తక్దీర్ పై విశ్వాసం |
| 34 | షిర్క్ (బహుదైవారాధన), దాని రకాలు |
| 37 | ఫిర్ఖయే నాజియ (ముక్తి పొందేవారు) |

# أصول العقيدة

# విశ్వాస మూలసూత్రాలు

## తౌహీద్ దాని రకాలు:

తౌహీద్ అంటే: విధిగా, అల్లాహ్ కు ప్రత్యేకంగా చేయబడే ప్రతి "ఆరాధన"లో అల్లాహ్ ను అద్వితీయునిగా నమ్మడం. అల్లాహ్ ఇచ్చిన ఆదేశాల్లో ఇది చాలా గొప్పది. అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

﴿ قُلْ هُوَ اللهُ أَحَدٌ ﴾ [الاخلاص:١]

**{ఇలా చెప్పండి! ఆయన అల్లాహ్, అద్వితీయుడు}.** (**సూరె ఇఖ్లాస్ 112: 1**).

మరోచోట ఇలా సెలవిచ్చాడు:

﴿ وَمَا خَلَقْتُ الجِنَّ وَالإِنْسَ إِلَّا لِيَعْبُدُونِ ﴾ [الذاريات: ٥٦]

**{నేను మానవులను, జిన్నాతులను కేవలం నన్ను ఆరాధించుటకే పుట్టించాను}.** (**జారియాత్ 51: 56**).

మరో ఆదేశం ఇలా ఉంది:

﴿ وَاعْبُدُوا اللهَ وَلَا تُشْرِكُوا بِهِ شَيْئًا ﴾ [النساء:٣٦]

**{కేవలం అల్లాహ్ నే ఆఃరాధించండి, ఆయనకు ఎవరినీ సాటి కల్పించకండి}.** (**సూరె నిసా 4: 36**).

తౌహీద్ మూడు రకాలుః (1) తౌహీదె రుబూబియత్, (2) తౌహీదె ఉలూహియత్, (3) తౌహీదె అస్మా వ సిఫాత్.

## (1) తౌహీదె రుబూబియత్:

అంటేః సృష్టి, దాని నిర్వహణలో అద్వితీయుడు అల్లాహ్ మాత్రమే. ఆయనే పోషకుడు, జీవన్మరణ ప్రధాత. భూమ్యాకాశాల అధికారం ఆయన చేతిలోనే ఉంది. దీనికి సంబంధించిన నిదర్శనాలు దివ్యగ్రంథం ఖుర్ఆనులో చదవండి:

﴿هَلْ مِنْ خَالِقٍ غَيْرُ اللهِ يَرْزُقُكُمْ مِنَ السَّمَاءِ وَالأَرْضِ لَا إِلَهَ إِلَّا هُوَ...﴾
[فاطر:٣]

**{ఆకాశము నుండి భూమి నుండి అల్లాహ్ తప్పా వేరే సృష్టికర్త మీకు ఆహారము నొసంగువాడు గలడా? "ఆరాధనకు నిజమైన అర్హుడు ఆయన తప్ప మరొకడు లేడు"...}. (ఫాతిర్ 35: 3).**

﴿تَبَارَكَ الَّذِي بِيَدِهِ الْمُلْكُ وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ قَدِيرٌ﴾

**{ఎవని చేతిలో సమస్త లోకపాలన గలదో ఆ అల్లాహ్ చాలా శుభాలు గలవాడు, ఆయన సర్వం పై సంపూర్ణ శక్తి గలవాడు}. (ముల్క్ 67: 1).**

అల్లాహ్ అధికారం విశ్వమంతటిలో ఉంది. అందులో తనిష్టానుసారం మార్పు చేస్తుంటాడు.

నిర్వహణలో అద్వితీయుడు కూడా కేవలం అల్లాహ్ మాత్రమే. సృష్టి కార్యాలు నెరవేర్చువాడు ఆయనే. ఈ ఆయతు చదవండిః

﴿أَلَا لَهُ الْخَلْقُ وَالْأَمْرُ تَبَارَكَ اللَّهُ رَبُّ الْعَالَمِينَ﴾

**{వినండి! సృష్టించుట, ఆజ్ఞాపించుట ఆయన పనే. సర్వ లోకాలకు పోషకుడగు అల్లాహ్ ఎంతో శుభదాయకుడు}. (ఆరాఫ్ 7: 54).**

అతని ఈ నిర్వహణ కార్యక్రమం సర్వసృష్టిలో అమలు చేయబడుతూ ఉన్నది.

తౌహీద్ యొక్క ఈ రకాన్ని తిరస్కరించినవారు చాలా అరుదు. వారు బాహ్యంగా తిరస్కరించినా, వారి అంతరాత్మ మటుకు దాన్ని ఒప్పుకుంటుంది. (ఫిర్ఔన్ వాళ్ళ గురించి) ఈ ఆయతు చదవండిః

﴿ وَجَحَدُوا بِهَا وَاسْتَيْقَنَتْهَا أَنْفُسُهُمْ ظُلْمًا وَعُلُوًّا ﴾ [النمل ١٤]

**{నిజానికి వారి మనస్సులు (సత్యాన్ని) నమ్మినప్పటికీ అన్యాయం, అహంకారంతో వారు దానిని తరస్కరించారు}. (27: నమ్ల్: 14).**

తౌహీద్ యొక్క ఈ ఒక్క రకాన్ని నమ్మినంత మాత్రాన ఏమీ ప్రయోజనం ఉండదు. ప్రవక్త కాలంలోని బహుదైవారాధకులు ఈ రకాన్ని నమ్మారు కాని అది వారికి ఏ లాభాన్నివ్వలేదు. ఖుర్ఆన్ సాక్ష్యం చదవండిః

﴿ وَلَئِنْ سَأَلْتَهُمْ مَنْ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ وَسَخَّرَ الشَّمْسَ وَالْقَمَرَ لَيَقُولُنَّ اللَّهُ فَأَنَّى يُؤْفَكُونَ ﴾ [العنكبوت ٦١]

**{భూమ్యాకాశాలను ఎవరు సృష్టించారని, సూర్యచంద్రుల్ని ఎవరు అదుపులో ఉంచ గలిగారని నీవు అడిగితే, అల్లాహ్ యే అని వారు తప్పకుండా అంటారు. అలాంటప్పుడు వారు ఎలా మోసపోతున్నారు?}. (అన్ కబూత్ 29:61).**

## (౨) తౌహీదె ఉలూహియత్:

అంటే: ఆరాధనలకు అర్హుడయిన అద్వితీయుడు ఆ పరమ పవిత్రుడు మాత్రమే. పూజించుటకు మరియు సాన్నిధ్యము పొందుటకు అల్లాహ్ తో పాటు మరెవ్వరినీ సాటి కల్పించకూడదు. తౌహీద్ యొక్క 3 రకాల్లో ఇదే అతిముఖ్యమైనది, గొప్పది. దీని కొరకే అల్లాహ్ మానవులను సృష్టించాడు. అల్లాహ్ ఆదేశం:

﴿ وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنْسَ إِلَّا لِيَعْبُدُونِ ﴾ [الذاريات: ٥٦]

**{నేను మానవులను, జిన్నాతులను కేవలం నన్ను ఆరాధించుటకే పుట్టించాను}**. (జారియాత్ 51: 56). ఈ విషయమే ప్రజలకు క్లుప్తంగా బోధించడానికి అల్లాహ్ ప్రవక్తలను పంపాడు, గ్రంథాలను అవతరింపజేశాడు. దీని సాక్ష్యాధారం దివ్య ఖుర్ఆనులో ఇలా ఉంది:

﴿وَمَا أَرْسَلْنَا مِنْ قَبْلِكَ مِنْ رَسُولٍ إِلَّا نُوحِي إِلَيْهِ أَنَّهُ لَا إِلَهَ إِلَّا أَنَا فَاعْبُدُونِ﴾ [الأنبياء:٢٥]

**{మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, అతనికి వహీ ద్వారా 'నేను తప్ప మరొక ఆరాధ్యుడు లేడు, కనుక మీరు నన్ను మాత్రమే ఆరాధించండి' అనే విషయాన్ని తెలియజేశాము}**. (అంబియా 21: 25).

తౌహీద్ యొక్క ఈ రకాన్నే బహుదైవారాధకులు తిరస్కరించారు, వారి ప్రవక్తలు ఈ తౌహీద్ యొక్క బోధ చేసినప్పుడు. దీనికి ఖుర్ఆన్ ఇలా సాక్ష్యమిస్తుంది:

﴿قَالُوا أَجِئْتَنَا لِنَعْبُدَ اللهَ وَحْدَهُ وَنَذَرَ مَا كَانَ يَعْبُدُ آبَاؤُنَا فَأْتِنَا بِمَا تَعِدُنَا إِنْ كُنْتَ مِنَ الصَّادِقِينَ﴾

**{(బహుదైవారాధకులు తమ ప్రవక్తలకు ఇలా జవాబిచ్చారు): నీవు మా వద్దకు రావటానికి కారణం, మేము ఒక్క అల్లాహ్ నే ఆరాధించాలనా, మా తాత ముత్తాతలు పూజిస్తూ వచ్చిన వాటిని విసర్జించాలనా?}**. (ఆరాఫ్ 7: 70).

అందుకే ఇబాదత్ (ఆరాధన) యొక్క ఏ రకమూ కూడా అల్లాహ్ యేతరులకు చేయుట ఎంత మాత్రం సమంజసం కాదు. ఆ అల్లాహ్ యేతరులు ఎవరైనా సరే: అతిసన్నిహితులైన దైవదూతలు, ప్రవక్తలు, మహా భక్తులు, సృష్టిరాసుల్లో ఎవ్వరినీ కూడా అల్లాహ్ తో సాటి కల్పించకూడదు.

## (3) తౌహీదె అస్మా వ సిఫాత్:

అంటేః అల్లాహ్ స్వయాన తన గురించి మరియు ప్రవక్త అల్లాహ్ గురించి ఏ పవిత్ర నామముల, ఉత్తమ గుణముల గురించి తెలిపారో వాటిని అల్లాహ్ కు తగిన రీతిలో విశ్వసించాలి. ఏ మాత్రం 'తహ్ రీఫ్', 'తత్ తీల్', 'తక్ యీఫ్', 'తమ్ సీల్'(1) లేకుండా. ఆయన గుణ నామములను యథార్థంగా నమ్మాలి. యథార్థానికి విరుద్ధంగా కాదు. వేటికి అల్లాహ్ అతీతుడని అల్లాహ్, ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారో వాటి నుండి అల్లాహ్ అతీతుడని నమ్మాలి. వేటి గురించి అల్లాహ్ అర్హుడా, అతీతుడా అని స్పష్టం లేదో వాటిలో మౌనం వహించాలి అంటే వాటికి అల్లాహ్ అర్హుడని అనవద్దు అతీతుడనీ అనవద్దు.

***పవిత్ర నామముల ఉదాహరణ:*** పవిత్రుడైన అల్లాహ్ 'అల్ హయ్య్' తన నామమని తెలిపాడు. అయితే 'అల్ హయ్య్' అల్లాహ్ నామాల్లో ఒకటని నమ్మాలి. ఇంకా ఆ పేరులో ఉన్న భావమును కూడా విశ్వసించాలి. అనగా ఆయన శాశ్వతముగా ఉండువాడు, ఆయనకు ముందు ఎవరు లేరు, తరువాత ఎవరు లేరు. (ఆయన సజీవుడు, నిత్యుడు). అదే విధముగా 'సమీఅ్' ఆయన పేరు, 'సమ్అ్' (వినుట) ఆయన గుణం అని నమ్మాలి.

---

1 '**తహ్ రీఫ్**' అంటేః ఏ ఆధారము లేకుండా నామగుణాల భావాన్ని మార్చుట. తారుమారు చేయుట. '**తత్ తీల్**' అంటేః అల్లాహ్ గుణనామాలన్నిటిని లేదా కొన్నిటిని తిరస్కరించుట. అల్లాహ్ ను నిరాకారునిగా నమ్ముట. '**తక్ యీఫ్**' అంటేః అల్లాహ్ గుణాలను మాట, ఊహ ద్వారా ఏదైనా ఒక రూపం ఇచ్చే ప్రయత్నం చేయుట. అల్లాహ్ చేయి అలా ఉంటుంది, ఇలా ఉంటుంది అని అనుట. '**తమ్ సీల్**' అంటేః అల్లాహ్ గుణాలను సృష్టి గుణాలతో పోల్చుట. లేదా సృష్టి గుణాల మాదిరిగా ఉంటాయని విశ్వసించుట.

***గుణముల ఉదాహరణ:*** అల్లాహ్ ఆదేశం:

﴿وَقَالَتِ اليَهُودُ يَدُ اللهِ مَغْلُولَةٌ غُلَّتْ أَيْدِيهِمْ وَلُعِنُوا بِمَا قَالُوا بَلْ يَدَاهُ مَبْسُوطَتَانِ يُنْفِقُ كَيْفَ يَشَاءُ﴾

**{"అల్లాహ్ చేతులు కట్టివేయబడి ఉన్నాయి" అని యూదులు అన్నారు. నిజానికి వారి చేతులే కట్టివేయబడ్డాయి. వారు అన్న ఈ మాట మూలంగా వారిని శపించటం జరిగింది. నిజానికి అల్లాహ్ చేతులు రెండూ విశాలంగా ఉన్నాయి. తాను తలచుకున్న విధంగా ఆయన ఖర్చుపెడుతున్నాడు.}. (మాఇద 5: 64).**

పై ఆయతులో అల్లాహ్ తనకు రెండు చేతులున్నాయని, అవి విచ్చలవిడిగా ఉన్నాయని తెలిపాడు. అంటే వాటి ద్వారా తనిష్టానుసారం అనుగ్రహాలు నొసంగుతాడని తెలిపాడు. అయితే అల్లాహ్ కు రెండు చేతులున్నాయని, వాటి ద్వారా అనుగ్రహాలు నొసంగుతాడని విశ్వసించడం మనపై విధిగా ఉంది. ఆ చేతులు ఇలా, అలా ఉంటాయని మనుసులో ఊహించే, లేదా నోటితో పలుకే ప్రయత్నం కూడా చేయవద్దు. వాటిని మానవుల చేతులతో పోల్చకూడదు. ఎందుకనగా అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

﴿لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ وَهُوَ السَّمِيعُ البَصِيرُ﴾

**{ఆయనకు పోలినది ఏదీ లేదు. మరియు ఆయన వినువాడు, చూచువాడు}. (షూరా 42:11).**

ఈ తౌహీద్ యొక్క సారాంశమేమిటంటే: అల్లాహ్ తన కొరకు, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ కొరకు ఏ ఏ గుణనామాల గురించి తెలిపారో వాటిని నమ్మాలి. వేటికి అల్లాహ్ అతీతుడని అల్లాహ్, ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారో వాటి నుండి అల్లాహ్ అతీతుడని నమ్మాలి. అయితే వాటిని తారుమారు చేయకుండా,

ఇతరులతో పోల్చకుండా, నిరాకారునిగా భావించకుండా నమ్మాలి. ఏ గుణనామముల విషయములో, అవి అల్లాహ్ కు సంబంధించినవేనా, లేదా అని స్పష్టం లేదో ఆ పదాల భావం లో అల్లాహ్ పట్ల అగౌరవం ఉంటే వాటిని ఖండించాలి. వాటి భావం లో ఏలాంటి దోషం లేకుంటే వాటిని స్వీకరించవచ్చు.

## లాఇలాహ ఇల్లల్లాహ్ యొక్క భావం

లాఇలాహ ఇల్లల్లాహ్, ఇస్లాం యొక్క పునాది. ఇస్లాములో దాని స్థానం చాలా గొప్పది. అది ఇస్లాం స్థంబాలలో మొదటిది. విశ్వాస భాగాలలో ఉన్నత భాగం. సత్కార్యాల అంగీకారం ఆ వచనాన్ని హృదయ పూర్వకంగా పఠించి దాని అర్థాన్ని తెలుసుకొని, దాని ప్రకారం ఆచరించడంపైనే ఆధారపడి ఉంది.

దాని వాస్తవ అర్థం: "**ఆరాధనకు నిజమైన అర్హుడు అల్లాహ్ తప్ప మరొకడు లేడు**". ఇదే సరియైన అర్థం. ఇది కాక అల్లాహ్ తప్ప సృష్టికర్త ఎవడు లేడు, అల్లాహ్ తప్ప శూన్యము నుండి ఉనికిలోకి తెచ్చే శక్తి గలవాడెవడు లేడు. లేక విశ్వంలో అల్లాహ్ తప్ప మరేమి లేదు అనే భావాలు (లాఇలాహ ఇల్లల్లాహ్ యొక్క అర్థం) కావు.

### ఈ పవిత్ర వచనములో రెండు మూల విషయా(రుకున్)లున్నాయి:

(1) ***నిరాకరించుట***, ఇది 'లాఇలాహ' అన్న పదంలో ఉంది. అనగా ఉలూహియ్యత్ (ఆరాధన అర్హత)ను ప్రతి వస్తువు నుండి నిరాకరించుట.

(2) ***అంగీకరించుట***, ఇది 'ఇల్లల్లాహ్' అన్న పదంలో ఉంది. అనగా ఉలూహియ్యత్ (ఆరాధన)కు అర్హతగల అద్వితీయుడు అల్లాహ్ మాత్రమేనని, ఆయనకు భాగస్వాముడెవడు లేడని నమ్ముట.

అల్లాహ్ తప్ప మరెవ్వరని ఆరాధించరాదు. ఆరాధనలోని ఏ ఒక్క భాగాన్ని కూడా అల్లాహ్ తప్ప ఇతరులకు చేయుట ఆమోదయోగ్యం కాదు. ఏ వ్యక్తి 'లాఇలాహ ఇల్లల్లాహ్' యొక్క ఈ వాస్తవ భావాన్ని తెలుసుకొని దాన్ని పఠిస్తాడో, దాని ప్రకారం ఆచరిస్తాడో మరియు దృఢ విశ్వాసముతో బహుదైవారాధనను తిరస్కరించి, అల్లాహ్ ఏకత్వమును విశ్వసిస్తాడో అతడే వాస్తవ ముస్లిం (విధేయుడు). ఇలాంటి విశ్వాసం లేకుండానే ఆచరించువాడు మునాఫిఖ్ (కపటవిశ్వాసి, వంచకుడు). మరియు దీనికి వ్యతిరేకంగా ఆచరించువాడు అది అతను నోటితో పలికినా ముష్రిక్ (బహుదైవారాధకుడు), కాఫిర్ (సత్యతిరస్కారి) అవుతాడు.

## లాఇలాహ ఇల్లల్లాహ్ ఘనత:

ఈ పవిత్ర వచన ఘనతలు, లాభాలు చాలా ఉన్నాయి. అందులో కొన్ని క్రింద తెలుపబడ్డాయి:

1- తౌహీద్ గల వ్యక్తి నరక శిక్షకు గురి అయినా, అతను అందులో శాశ్వతంగా ఉండకుండా లాఇలాహ ఇల్లల్లాహ్ అడ్డు పడుతుంది.

**(يَخْرُجُ مِنَ النَّارِ مَنْ قَالَ لَا إِلَهَ إِلَّا اللهُ وَفِي قَلْبِهِ وَزْنُ شَعِيرَةٍ مِنْ خَيْرٍ وَيَخْرُجُ مِنَ النَّارِ مَنْ قَالَ لَا إِلَهَ إِلَّا اللهُ وَفِي قَلْبِهِ وَزْنُ بُرَّةٍ مِنْ خَيْرٍ وَيَخْرُجُ من النَّارِ مَنْ قَالَ لَا إِلَهَ إِلَّا اللهُ وَفِي قَلْبِهِ وَزْنُ ذَرَّةٍ مِنْ خَيْرٍ).**

ప్రవక్త చెప్పారు: "**లాఇలాహ ఇల్లల్లాహ్ పఠించిన వ్యక్తి హృదయంలో జొన్న గింజంత విశ్వాసమున్నా నరకం నుండి వెలికి వస్తాడు. ఏ వ్యక్తి లాఇలాహ ఇల్లల్లాహ్ చదివాడో అతని హృదయంలో గోదుమ గింజంత విశ్వాసమున్నా నరకం నుండి వెలికి వస్తాడు. అలాగే ఎవరు లాఇలాహ ఇల్లల్లాహ్**

**చదివాడో అతని మనుస్సులో ఇసుమంత / రవ్వంత విశ్వాసమున్నా అతనూ నరకం నుండి వెలికి వస్తాడు"**. (బుఖారి 44).

2- మానవులు, జిన్నాతులు దీని (లాఇలాహ...) కొరకే పుట్టించబడ్డారు. అల్లాహ్ ఆదేశం:

﴿ وَمَا خَلَقْتُ الجِنَّ وَالإِنْسَ إِلَّا لِيَعْبُدُونِ ﴾ [الذاريات: ٥٦]

**{నేను మానవులను, జిన్నాతులను కేవలం నన్ను ఆరాధించుటకే పుట్టించాను}. (జారియాత్ 51:56)**

పై ఆయతులో 'యఅ్బుదూన్' అన్న పదానికి అర్థం ఆరాధించుట. అంటే ఆరాధనలో అల్లాహ్ ఏకత్వాన్ని పాటించుట.

3- ప్రవక్తలను పంపబడింది, గ్రంథాలను అవతరింపజేయబడింది దీని ప్రచారం కొరకే. అల్లాహ్ ఆదేశం పై శ్రద్ధ వహించండి:

﴿ وَمَا أَرْسَلْنَا مِنْ قَبْلِكَ مِنْ رَسُولٍ إِلَّا نُوحِي إِلَيْهِ أَنَّهُ لَا إِلَهَ إِلَّا أَنَا فَاعْبُدُونِ ﴾
[الأنبياء:٢٥]

**{మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, అతనికి వహీ ద్వారా 'నేను తప్ప మరొక ఆరాధ్యుడు లేడు, కనుక మీరు నన్ను మాత్రమే ఆరాధించండి' అనే విషయాన్ని తెలియజేశాము}. (అంబియా 21: 25).**

4- ప్రవక్తల ప్రచార ఆరంభం ఇదే (లాఇలాహ ఇల్లల్లాహ్). ప్రతి ప్రవక్త తమ జాతి వారికి ఇదే పిలుపునిచ్చారు. చదవండి అల్లాహ్ ఆదేశం:

﴿ اعْبُدُوا اللَّهَ مَا لَكُمْ مِنْ إِلَهٍ غَيْرُهُ ﴾ (الأعراف 59)

**{మీరు అల్లాహ్ నే ఆరాధించండి. ఆయన తప్ప వేరు దేవుడు మీకు లేడు}. (సూరె ఆరాఫ్ 7: 59, 73, 85. హూద్ 11:26, 50, 61, 84).**

## లాఇలాహ ఇల్లల్లాహ్ యొక్క నిబంధనలు:

ఈ పవిత్ర వచనం యొక్క నిబంధనలు ఏడున్నాయి. ఏ కొరత లేకుండా వాటన్నిటినీ పాటిస్తేనే వాస్తవంగా లాఇలాహ ఇల్లల్లాహ్ పఠించినట్లు.

1- ఇల్మ్ (జ్ఞానం): పవిత్ర వచనము యొక్క వాస్తవ భావ జ్ఞానం. అనగా (పైన తెలిపిన ప్రకారం) ***(1)నిరాకరించుట***, ***(2)అంగీకరించుట*** మరియు దాని ప్రకారం ఆచరించుట. 'అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యనీయుడు లేడు, ఇతరుల ఆరాధన వ్యర్థము మరియు తుచ్ఛము' అని తెలుసుకొని దాని ప్రకారంగా ఆచరించిన మానవుడే వాస్తవంగా దాని భావాన్ని తెలుసుకున్న జ్ఞాని.

﴿ فَاعْلَمْ أَنَّهُ لَا إِلَهَ إِلَّا اللَّهُ ﴾ [محمد:١٩]

**{తెలుసుకో! "ఆరాధనకు నిజమైన అర్హుడు అల్లాహ్ తప్ప మరొకడు లేడు"}. (ముహమ్మద్ 47: 19).**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారుః

**(مَنْ مَاتَ وَهُوَ يَعْلَمُ أَنَّهُ لَا إِلَهَ إِلَّا اللهُ دَخَلَ الْجَنَّةَ)**

**"ఆరాధనకు నిజమైన అర్హుడు అల్లాహ్ తప్ప మరొకడు లేడు" అని తెలుసుకొని మరణించిన వారు స్వర్గములో చేరుదురు".** (ముస్లిం 26).

2- యఖీన్ (నమ్మకం): మనశ్శాంతి కలిగే పూర్తి నమ్మకం మరియు మనుషుల్లో, జిన్నాతులోగల షైతానులు కలుగ జేసే అనుమానాల్లో పడకుండా దృఢ విశ్వాసంతో ఈ పవిత్ర వచనం పఠించాలి. సూర హుజురాత్ (49:15)లో అల్లాహ్ ఆదేశం:

﴿ إِنَّمَا الْمُؤْمِنُونَ الَّذِينَ آمَنُوا بِاللَّهِ وَرَسُولِهِ ثُمَّ لَمْ يَرْتَابُوا ﴾ [الحجرات ١٥]

**{అల్లాహ్ ను, ఆయన ప్రవక్తను (దృఢంగా) విశ్వసించిన తర్వాత ఎలాంటి సందేహానికి తావీయకుండా ఉండేవారే నిజమైన విశ్వాసులు}.**

عَنْ أَبِي هُرَيْرَةَ ﷺ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: **(أَشْهَدُ أَنْ لَا إِلَهَ إِلَّا اللهُ وَأَنِّي رَسُولُ اللهِ لَا يَلْقَى اللهَ بِهِمَا عَبْدٌ غَيْرَ شَاكٍّ فِيهِمَا إِلَّا دَخَلَ الْجَنَّةَ)**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారని అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః "**ఆరాధనకు నిజమైన అర్హుడు అల్లాహ్ తప్ప మరొకడు లేడని మరియు నేను అల్లాహ్ ప్రవక్తనని సాక్ష్యం ఇచ్చుచున్నాను. ఎవరు ఏలాంటి సందేహం లేకుండా ఈ రెండు సాక్ష్యాలతో అల్లాహ్ ను కలుసుకుంటాడో అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడు**". (ముస్లిం 27).

3- ఖుబూల్ (సమ్మతించుట): ఈ పవిత్ర వచనం ద్వారా రుజువయ్యే విషయాలన్నిటినీ మనసావాచా సమ్మతించాలి. ప్రవక్త తెలిపిన విషయాల్ని సత్యంగా నమ్మాలి. ఆయన తెచ్చిన ప్రతి దానిని విశ్వసించాలి, సమ్మతించాలి. అందులో ఏ ఒక్క దానిని విస్మరించకూడదు. అల్లాహ్ ఇదే ఆదేశమిచ్చాడు:

﴿آمَنَ الرَّسُولُ بِمَا أُنْزِلَ إِلَيْهِ مِنْ رَبِّهِ وَالْمُؤْمِنُونَ كُلٌّ آمَنَ بِاللَّهِ وَمَلَائِكَتِهِ وَكُتُبِهِ وَرُسُلِهِ لَا نُفَرِّقُ بَيْنَ أَحَدٍ مِنْ رُسُلِهِ وَقَالُوا سَمِعْنَا وَأَطَعْنَا غُفْرَانَكَ رَبَّنَا وَإِلَيْكَ الْمَصِيرُ﴾ [البقرة ٢٨٥]

**{తన ప్రభువు తరఫున అవతరింపజేయబడిన దానిని ప్రవక్త విశ్వసించారు. దాన్ని విశ్వాసులు కూడా (సత్యమని నమ్మారు). వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలనూ విశ్వసించారు. ''మేము ఆయన (పంపిన) ప్రవక్తల మధ్య ఎలాంటి విచక్షణను, భేదభావాన్నీ పాటించము'' (అని వారు చెబుతారు). ''మేము విన్నాము. విధేయులం అయ్యాము. మా ప్రభూ! మేము నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము.**

**కడకు మేము మరలి రావలసింది నీ వద్దకే'' అని అంటారు.}. (బఖర 2: 285).**

ధర్మ శాసనాలను, హద్దులను ఆక్షేపించుట, లేక వాటిని నమ్మకపోవుట సమ్మతమునకు వ్యతిరేకం. ఉదాహరణకుః కొందరు దొంగ మరియు వ్యభిచారునిపై విధించిన హద్దులను లేక బహుభార్యత్వం, ఆస్తుల పంపకం లాంటి తదితర విషయాలను ఆక్షేపిస్తారు. (అయితే ఇలాంటి వారు అల్లాహ్ యొక్క ఈ ఆదేశం వినలేదా, చదవలేదా?)

﴿وَمَا كَانَ لِمُؤْمِنٍ وَلَا مُؤْمِنَةٍ إِذَا قَضَى اللَّهُ وَرَسُولُهُ أَمْرًا أَنْ يَكُونَ لَهُمُ الْخِيَرَةُ مِنْ أَمْرِهِمْ﴾ [الأحزاب ٣٦]

**{అల్లాహ్, ఆయన ప్రవక్త ఏ విషయములోనైనా ఒక తీర్పు చేసినప్పుడు విశ్వాసి అయిన ఏ పురుషునికి, విశ్వాసురాలైన ఏ స్త్రీకి, తరువాత తమ యొక్క ఆ విషయంలో స్వయంగా మళ్ళీ ఒక నిర్ణయం తీసుకునే హక్కు లేదు}. (అహ్ జాబ్ 33: 36).**

4- ఇన్ ఖియాద్ (లొంగిపోవుట, శిరసావహించుట): పవిత్ర వచనం యొక్క అర్థభావాల పట్ల శిరసావహించాలి. ఇన్ ఖియాద్ మరియు ఖబూల్ లో తేడా ఏమనగాః ఖబూల్ అంటే నోటితో దాని భావాన్ని సమ్మతించుట. ఇన్ ఖియాద్ అంటే సమ్మతంతో పాటు దాన్ని ఆచరణ రూపంలో తీసుకువచ్చుట. ఒక వ్యక్తి లాఇలాహ ఇల్లల్లాహ్ అర్థభావాన్ని తెలుసుకొని, దాన్ని మనస్ఫూర్తిగా నమ్మి, దాన్ని సమ్మతించినప్పటికీ దానికి లొంగిపోయి, శిరసావహించి, దాని ప్రకారం ఆచరించకపోయినట్లైతే అతను ఇన్ ఖియాద్ యొక్క నిబంధన పాటించనట్లే. అల్లాహ్ ఇలా సంబోధించాడుః

﴿وَأَنِيبُوا إِلَى رَبِّكُمْ وَأَسْلِمُوا لَهُ﴾ [الزمر ٥٤]

**{మీరు మీ ప్రభువు వైపునకు మరలి ఆయనకే విధేయత చూపండి}. (జుమర్ 39: 54).**

మరో చోట ఇలా ఆదేశించాడు:

﴿ فَلَا وَرَبِّكَ لَا يُؤْمِنُونَ حَتَّى يُحَكِّمُوكَ فِيمَا شَجَرَ بَيْنَهُمْ ثُمَّ لَا يَجِدُوا فِي أَنْفُسِهِمْ حَرَجًا مِمَّا قَضَيْتَ وَيُسَلِّمُوا تَسْلِيمًا ﴾ [النساء ٦٥]

**{నీ ప్రభువు తోడు! వారు తమ పరస్పర వివాదాలన్నింటిలో నిన్ను తీర్పరిగా చేసుకోనంతవరకూ, తర్వాత నీవు వారి మధ్య చెప్పిన తీర్పుపట్ల వారు తమ మనసులలో ఎలాంటి సంకోచానికి, అసంతృప్తికి ఆస్కారం ఇవ్వకుండా మనస్ఫూర్తిగా శిరసావహించనంతవరకూ వారు విశ్వాసులు కాజాలరు.}. (నిసా 4: 65)**

5- సిద్ఖ్: (సత్యత): మనిషి తన విశ్వాసములో సత్యవంతుడై యుండాలి. అల్లాహ్ ఆదేశం:

﴿ يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللهَ وَكُونُوا مَعَ الصَّادِقِينَ ﴾ [التوبة:١١٩]

**{ఓ విశ్వాసులారా! అల్లాహ్ కు భయపడండి. సత్యవంతులతో ఉండండి}. (తౌబా 9:119).**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సెలవిచ్చారుః

مَنْ شَهِدَ أَنْ لَا إِلَهَ إِلَّا اللهُ صَادِقًا بِهَا دَخَلَ الْجَنَّةَ

**"హృదయాంతర సత్యముతో 'లాఇలాహ ఇల్లల్లాహ్' పఠించినవారు స్వర్గంలో చేరుదురు". (ముస్నద్ అహ్మద్).**

ఎవరైనా ఈ పవిత్ర వచనం కేవలం నోటితో పలికి, దాని అర్థభావాలను మనస్ఫూర్తిగా నమ్మకున్నట్లయితే అతనికి ముక్తి ప్రాప్తించదు. అతడు కపట విశ్వాసులలో పరిగణించబడుతాడు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తీసుకువచ్చిన వాటన్నిటిని లేదా కొన్నిటిని తిరస్కరించడం కూడా సత్యతకు వ్యతిరేకంలోనే వస్తుంది. ఎందుకనగా మనము ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు విధేయులై ఉండాలని, ఆయన మాటల్ని సత్యంగా నమ్మాలని అల్లాహ్ ఆదేశించాడు, అంతే కాదుః ఆయన విధేయతను తన విధేయతతో కలిపి చెప్పాడు. సూర నూర్ (24: 54)లో ఉందిః

﴿ قُلْ أَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُولَ ﴾ [النور:٥٤]

**{అల్లాహ్ కు విధేయులు కండి, అల్లాహ్ ప్రవక్తకు విధేయులు కండి}.**

6- ఇఖ్లాస్: మనిషి తను చేసే ప్రతి పనిని సంకల్ప పరంగా షిర్క్ దరిదాపులకు అతీతంగా ఉంచుటయే ఇఖ్లాస్, అంటే సర్వ పనులు, మాటలు కేవలం అల్లాహ్ సంతృప్తి కొరకు, ఆయన ప్రసన్నత పొందుటకే చేయాలి. అందులో ఏ మాత్రం ప్రదర్శనాబుద్ధి, పేరు ప్రఖ్యాతుల కాంక్ష, ప్రాపంచిక లాభోద్దేశ్యం, స్వార్థం ఉండకూడదు. ఇంకా ఆ పని అల్లాహ్ యేతరుని ప్రేమలో, అల్లాహ్ మార్గానికి విరుద్ధంగా ధార్మిక లేదా ఇతర వర్గాల పక్షంలో ఉండకూడదు. కేవలం అల్లాహ్ అభీష్టాన్ని మరియు పరలోక సాఫల్యాన్ని పొందుట కొరకే చేయాలి. ఎవరి నుండైనా ప్రతిఫలాన్నిగానీ, కృతజ్ఞతలనుగానీ ఆశిస్తూ వారి వైపునకు మనుసు మరలకూడదు. సూర జుమర్ (39: 3)లో ఉందిః

﴿ أَلَا لِلَّهِ الدِّينُ الْخَالِصُ ﴾ [الزُّمر:٣]

**{జాగ్రత్త! ధర్మం ప్రత్యేకంగా అల్లాహ్ కు చెందిన హక్కు మాత్రమే}.**

﴿ وَمَا أُمِرُوا إِلَّا لِيَعْبُدُوا اللَّهَ مُخْلِصِينَ لَهُ الدِّينَ حُنَفَاءَ ﴾ [البينة ٥]

**{వారు అల్లాహ్ కు దాస్యం చేయాలని, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలని ఆదేశించటం జరిగింది}. (98: 5).**

عن عِتْبَانَ بْنِ مَالِكٍ ﷺ قَالَ: قَالَ رَسُولُ الله ﷺ: **(فَإِنَّ اللهَ قَدْ حَرَّمَ عَلَى النَّارِ مَنْ قَالَ لَا إِلَهَ إِلَّا اللهُ يَبْتَغِي بِذَلِكَ وَجْهَ الله).**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారని, ఇత్బాన్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారుః "**అల్లాహ్ అభీష్టాన్ని పొందుటకు 'లాఇలాహ ఇల్లల్లాహ్' చదివిన వారిపై నిశ్చయంగా అల్లాహ్ నరకమును నిషేధించాడు**". (బుఖారి 425, ముస్లిం 33).

7- ముహబ్బత్ (ప్రేమ): ఈ పవిత్ర వచనము మరియు దీనికి సంబంధించిన వాటి ప్రేమ. ముస్లిం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను ప్రేమించాలి, వారిద్దరిపై ప్రేమ అందరి ప్రేమకు మించియుండాలి. ప్రేమకు సంబంధించిన షరతులు వగైరా పూర్తిగా పాటించాలి. అల్లాహ్ ను మరియు అల్లాహ్ ప్రేమించువాటిని గౌరవభావంతో, భయం మరియు ఆశలతో ప్రేమించాలి. ఉదాః **స్థలాల్లో:** మక్కా, మదీన, మస్జిదులు. **కాలాల్లో:** రమజాను, జిల్ హిజ్జ మొదటి దశ వగైరా. **మానవుల్లో:** ప్రవక్తలు, దూతలు, సత్యవంతులు, అమరవీరులు, పుణ్యాత్ములు వగైరా. **సత్కార్యాల్లో:** నమాజు, జకాతు, ఉపవాసం (రోజా), హజ్. **వాచ సంబంధమైన:** **జిక్ర్** (అల్లాహ్ స్మరణ), ఖుర్ఆన్ పారాయణం వగైరాలు.

మనిషి అల్లాహ్ ప్రేమించువాటిని తన మనుసు, కోరికలు ప్రేమించే వాటిపై ఆధిక్యతివ్వాలి. ఇంకా అల్లాహ్ అసహ్యించుకునేవాటిని అసహ్యించు కోవాలి: అవిశ్వాసులను, అవిశ్వాసాన్ని, పాపాల్ని (అశ్లీలతల్ని), అవిధేయతలను అసహ్యించుకోవాలి. అల్లాహ్ ఆదేశం:

**﴿يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا مَنْ يَرْتَدَّ مِنْكُمْ عَنْ دِينِهِ فَسَوْفَ يَأْتِي اللَّهُ بِقَوْمٍ يُحِبُّهُمْ وَيُحِبُّونَهُ أَذِلَّةٍ عَلَى الْمُؤْمِنِينَ أَعِزَّةٍ عَلَى الْكَافِرِينَ يُجَاهِدُونَ فِي سَبِيلِ اللَّهِ وَلَا**

يَخَافُونَ لَوْمَةَ لَائِمٍ﴾ [المائدة ٥٤]

**{ఓ విశ్వాసులారా! మీలో ఎవరైనా తమ ధర్మం నుండి వైదొలిగిపోతే, అల్లాహ్ ఇంకా ఎంతో మందిని సృష్టిస్తాడు. అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు. వారు అల్లాహ్ ను ప్రేమిస్తారు. వారు విశ్వాసుల పట్ల మృదువుగానూ, అవిశ్వాసుల పట్ల కఠినంగానూ ప్రవర్తిస్తారు. అల్లాహ్ మార్గంలో యుద్ధం చేస్తారు. నిందించే వారి నిందలకు వారు భయపడరు}. (మాఇద 5: 54).**

## 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' భావం:

మనోవాక్కుల ద్వారా ఆయన అల్లాహ్ యొక్క దాసుడు మరియు సర్వ మానవాళికి ప్రవక్త అని విశ్వసించాలి. దాని ప్రకారం ఆచరించాలి, అంటే: ①ఆయన ఆదేశాల పట్ల విధేయత చూపాలి, ②ఆయన తెలిపిన విషయాలన్ని సత్యం అని నమ్మాలి, ③నిషేధించిన, ఖండించిన వాటికి దూరంగా ఉండాలి, ④ఆయన చూపిన విధంగానే అల్లాహ్ ను ఆరాధించాలి.

'ముహమ్మదుర్రసూలుల్లాహ్' సాక్ష్యం పలికినప్పుడు అందులో ఉన్న రెండు మూల విషయాల(రుకున్)లను గ్రహించాలి. అవి: '**అబ్దుహూ వ రసూలుహూ**'. ఈ రెండు రుకున్లు ఆయన హక్కులో హెచ్చు తగ్గులు చేయుట నుండి కాపాడతాయి. ఆయన 'అల్లాహ్ దాసుడు మరియు ప్రవక్త'. ఈ రెండు ఉత్తమ గుణాల ద్వారా ఆయన సర్వ మానవాళిలో గొప్ప విశిష్ఠత గలవారు. ఇక్కడ 'అబ్ద్' యొక్క అర్థం దాసుడు, ఉపాసకుడు అని. అంటే ఆయన మనిషి, ఇతర మనుషులు ఎలా పుట్టారో ఆయన కూడా అలాగే పుట్టారు. మానవులకు ఉన్నటువంటి అవసరాలే ఆయనకు ఉండేవి. సూర కహ్ ఫ్ (18:110)లో అల్లాహ్ ఆదేశం:

﴿قُلْ إِنَّمَا أَنَا بَشَرٌ مِثْلُكُمْ﴾ [الكهف ١١٠]

**{ప్రవక్తా ఇలా చెప్పుః నేను కేవలం ఒక మానవుణ్ణి. మీలాంటి వాణ్ణి}.**

ఇదే సూరా మొదటి ఆయతులో ఇలా ఉందిః

﴿الْحَمْدُ لِلَّهِ الَّذِي أَنْزَلَ عَلَى عَبْدِهِ الْكِتَابَ﴾ [الكهف ١]

**{అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు, ఆయన తమ దాసునిపై ఈ గ్రంథాన్ని అవతరింపజేశాడు}.**

'రసూల్' అనగా ఆయన సర్వ మానవాళి వైపునకు శుభవార్తనిచ్చు, హెచ్చరించు ప్రవక్త అని అర్థం. (దీనికి సంబంధించిన ఆధారాలు ఖుర్ఆనులో చాలా ఉన్నాయి. చూడండి సూర సబా (34:28), సూర అంబియా (21:107).

ఈ రెండు ఉత్తమ గుణాలు (రుకున్లు) ఆయన పట్ల అతిశయోక్తి (హెచ్చు) మరియు అమర్యాద (తగ్గు)ల నుండి కాపాడతాయి. ఎలా అనగా ఆయన అనుచరులు అని చెప్పుకునే కొందరు ఈ రోజుల్లో ఆయన స్థానాన్ని, హక్కును అర్థం చేసుకోక అతిశయమించి ఆయన్ని అల్లాహ్ తో సమానంగా పోలుస్తున్నారు. అల్లాహ్ ను వదలి ఆయనతో మొరపెడుతున్నారు. అవసరాలు తీర్చడం, కష్టాలు తొలగించడం లాంటి అల్లాహ్ శక్తిలో మాత్రమే ఉన్న వాటిని ఆయనతో కోరుతున్నారు. మరి కొందరు ఆయన గౌరవ మర్యాదలకు విరుద్ధంగా ఆయన్ను ప్రవక్తగా నమ్మడం లేదు. లేదా ఆయన అనుకరణలో కొరత చూపి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెచ్చిన విషయాలకు వ్యతిరేకమైన వాటిని నమ్ముతున్నారు. ఇతరుల మాటలను ఆయన సున్నతలపై ప్రాధాన్యతనిస్తున్నారు, ఆయన సున్నతులను ఆచరించకుండా వదులుతున్నారు, ఆయన తీసుకువచ్చిన సత్య మాట/ బాటకు వ్యతిరేకమైన మాట/బాటలపై గుడ్డిగా మొండిపట్టుతో ఉన్నారు.

## విశ్వాసం, దాని మూలసూత్రాలు:

వాచాకర్మను విశ్వాసం అంటారు. అది సత్కార్యాలతో పెరుగుతుంది, పాపాలతో తరుగుతుంది. హృదయం మరియు నాలుక మాటను ఇంకా హృదయం, నాలుక మరియు అవయవాల పనిని విశ్వాసం అంటారు. హృదయ మాట అంటే: హృదయ పూర్వకంగా విశ్వసించుట, సత్యపరచుట. నాలుక మాట అంటే: అంగీకరించుట. హృదయ పని అంటే: సమ్మతించుట, ఇఖ్లాస్, లొంగిపోవుట, ప్రేమ, సత్కార్యాల సంకల్పం. అవయవాల పని అంటే: ఇస్లాం ఇచ్చిన ఆదేశాలను నెరవేర్చుట మరియు నిశిద్ధతలను విడనాడుట.

విశ్వాసానికి కొన్ని మూలసూత్రాలున్నాయని ఖుర్ఆన్ మరియు హదీసుల ద్వారా రుజువైనది. అవిః (1) అల్లాహ్ ను, (2) ఆయన దూతలను, (3) ఆయన పంపిన గ్రంథాలను, (4) ఆయన ప్రవక్తలను, (5) ప్రళయదినాన్ని, (6) మంచి, చెడు తక్దీర్ (విధివ్రాత)ను విశ్వసించడం. అందు లో కొన్ని ఈ ఆయతులో ప్రస్తావించబడినవిః

﴿آمَنَ الرَّسُولُ بِمَا أُنْزِلَ إِلَيْهِ مِنْ رَبِّهِ وَالْمُؤْمِنُونَ كُلٌّ آمَنَ بِاللَّهِ وَمَلَائِكَتِهِ وَكُتُبِهِ وَرُسُلِهِ لَا نُفَرِّقُ بَيْنَ أَحَدٍ مِنْ رُسُلِهِ وَقَالُوا سَمِعْنَا وَأَطَعْنَا غُفْرَانَكَ رَبَّنَا وَإِلَيْكَ الْمَصِيرُ﴾ (البقرة ٢٨٥)

**{తన ప్రభువు తరఫున అవతరింపజేయబడిన దానిని ప్రవక్త విశ్వసించారు. దాన్ని విశ్వాసులు కూడా (సత్యమని నమ్మారు). వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలనూ విశ్వసించారు. "మేము ఆయన (పంపిన) ప్రవక్తల మధ్య ఎలాంటి విచక్షణను, భేదభావాన్నీ పాటించము" (అని వారు చెబుతారు). "మేము విన్నాము. విధేయులం అయ్యాము. మా ప్రభూ! మేము నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము.**

**కడకు మేము మరలి రావలసింది నీ వద్దకే'' అని అంటారు.}. (బఖర 2: 285).**

సహీహ్ ముస్లింలో ఇలా ఉంది: అమీరుల్ మోమినీన్ హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: జిబ్రీల్ అలైహిస్సలాం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో విశ్వాసం (ఈమాన్) అంటేమిటి అని అడిగాడు. దానికి ప్రవక్త ఇలా జవాబిచ్చారు: "విశ్వాసం అంటే నీవు ①అల్లాహ్ ను, ఆయన ②దూతలను, ఆయన ③గ్రంథాలను, ఆయన ④ప్రవక్తలను, ⑤పరలోకదినాన్ని మరియు ⑥మంచి చెడుల విధివ్రాతను విశ్వసించుట". (ముస్లిం 8).

ఈ ఆరు విషయాలే సత్యవిశ్వాసం యొక్క మూలసూత్రాలు. వీటినే అల్లాహ్ ఖుర్ఆనులో మరియు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హదీసుల్లో ప్రస్తావించారు. వీటినే విశ్వాస మూలసూత్రాలు (అర్కానె ఈమాన్) అంటారు. వీటి వివరణ క్రింద చదవండి:

## 1- అల్లాహ్ పై విశ్వాసం:

అంటే: ఉలూహియత్, రుబూబియత్ మరియు అస్మా వ సిఫాత్ లో అల్లాహ్ అద్వితీయుడని విశ్వసించాలి. అల్లాహ్ పై విశ్వాసంలో ఈ క్రింది విషయాలు కూడా వచ్చును.

1- అల్లాహ్ యే వాస్తవ ఆరాధ్యుడు, సర్వ ఆరాధనలకు అర్హుడు. ఆయన గాక వేరే లేదా ఆయనతో పాటు మరొకడు ఏ మాత్రం అర్హుడు కాడు. ఎందుకనగా మానవుల సృష్టికర్త, వారికి మేలు చేయువాడు, వారికి ఆహారం నొసంగువాడు, వారి రహస్య, బహిరంగ విషయాలన్నీ తెలిసినవాడు, పుణ్యాత్ములకు సత్ఫలితం మరియు పాపాత్ములను శిక్షించు శక్తిగలవాడు ఆయన మాత్రమే.

ఈ ఆరాధన యొక్క వాస్తవికత ఏమిటంటేః సర్వ ఆరాధనలు వినయ వినమ్రతలతో, ఆయన ఔన్నత్యాల ముందు హీనభావంతో, పూర్తి ప్రేమతో, భీతిల్లుతూ, కారుణ్యాశలతో అద్వితీయుడైన అల్లాహ్ కే ప్రత్యేకించి చేయాలి. ఈ గొప్ప మౌలిక విషయంతోనే ఖుర్ఆన్ అవతరించింది. అల్లాహ్ ఆదేశాలు చదవండి:

﴿فَاعْبُدِ اللَّهَ مُخْلِصًا لَهُ الدِّينَ * أَلَا لِلَّهِ الدِّينُ الْخَالِصُ﴾ [الزمر ٢-٣]

**{కనుక నీవు ధర్మాన్ని అల్లాహ్ కే ప్రత్యేకిస్తూ, అల్లాహ్ కు మాత్రమే దాస్యం చెయ్యి. జాగ్రత్త! ధర్మం ప్రత్యేకంగా అల్లాహ్ కు చెందిన హక్కు మాత్రమే}. (జుమర్ 39: 2,3).**

﴿وَقَضَى رَبُّكَ أَلَّا تَعْبُدُوا إِلَّا إِيَّاهُ﴾ [الإسراء ٢٣]

**{మీరు ఆయన్ని తప్ప మరెవ్వరినీ ఆరాధించకండి అని మీ ప్రభువు ఆజ్ఞాపించాడు}. (బనీ ఇస్రాఈల్ 17:23). మోమిన్ 40:14లో ఉంది:**

﴿فَادْعُوا اللَّهَ مُخْلِصِينَ لَهُ الدِّينَ وَلَوْ كَرِهَ الْكَافِرُونَ﴾

**{మీరు మీ ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకుని ఆయన్నే వేడుకుంటూ ఉండండి - అవిశ్వాసులకు అది ఎంతగా సహించరానిదైనా సరే!}.**

ఆరాధన యొక్క రకాలు అనేకమున్నాయి, అందులో కొన్ని ఇవిః దుఆ (ప్రార్థన, వేడుకోలు), ఖౌఫ్ (భయం), రజా (ఆశ), తవక్కుల్ (నమ్మకం), రగ్బత్ (ఆసక్తి), రహబ్ (మహాభీతి), ఖుషూఅ్ (నమ్రత), ఖషియత్ (గౌరవభావంతో భీతి), ఇనాబత్ (మరలుట), ఇస్తిఆనత్ (సహాయం అర్థించుట), ఇస్తిఆజ (శరణు కోరుట), ఇస్తిఘాస (మొరపెట్టుకొనుట), జిబహ్ (బలిదానం), నజ్ర్ (మ్రొక్కుబడి) తదితర ఆరాధన రకాలు. ఇవన్నియూ అల్లాహ్ తప్ప ఇతరుల కొరకు చేయుట

ఆమోదయోగ్యం కాదు. అలా చేయుట షిర్క్ (బహుదైవారాధన) మరియు **కుఫ్ర్** (సత్యతిరస్కారం)గా పరిగణించబడుతుంది.

**దుఆ** (ప్రార్థన, వేడుకోలు) యొక్క ఆధారం. అల్లాహ్ ఆదేశం చదవండి:

﴿ وَقَالَ رَبُّكُمُ ٱدۡعُونِيٓ أَسۡتَجِبۡ لَكُمۡۚ إِنَّ ٱلَّذِينَ يَسۡتَكۡبِرُونَ عَنۡ عِبَادَتِي سَيَدۡخُلُونَ جَهَنَّمَ دَاخِرِينَ ﴾

**{నీ ప్రభువు ఇలా అంటున్నాడు, "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనై నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పనిసరిగా అవమానానికీ, పరాభవానికీ గురి అయి నరకంలో ప్రవేశిస్తారు"}. (మోమిన్ 40: 60).**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారని, నౌమాన్ బిన్ బషీర్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: "**దుఆయే ఆరాధనే**". (తిర్మిజి 2969).

**ఖౌఫ్** (భయం) యొక్క ఆధారం. అల్లాహ్ ఆదేశం చదవండిః

﴿ فَلَا تَخَافُوهُمْ وَخَافُونِ إِنْ كُنْتُمْ مُؤْمِنِينَ ﴾ [آل عمران ١٧٥]

**{మీరు మానవులకు భయపడకండి, నిజంగా మీరు విశ్వసించినవారయితే నాకే భయపడండి}. (ఆలి ఇమ్రాన్ 3: 175).**

**రజా** (ఆశ) యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశం:

﴿ فَمَنْ كَانَ يَرْجُو لِقَاءَ رَبِّهِ فَلْيَعْمَلْ عَمَلًا صَالِحًا وَلَا يُشْرِكْ بِعِبَادَةِ رَبِّهِ أَحَدًا ﴾ [الكهف ١١٠]

**{తమ ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడు సత్కార్యాలు చేయాలి. ఆరాధనలో తన ప్రభువుతో పాటు మరెవ్వరినీ చేర్చకూడదు}. (కహ్ ఫ్ 18:110)**

**తవక్కుల్** (నమ్మకం) యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశాలు చదవండి:

﴿ وَعَلَى اللَّهِ فَتَوَكَّلُوا إِنْ كُنْتُمْ مُؤْمِنِينَ ﴾ [المائدة ٢٣]

**{మీరు నిజంగా విశ్వాసులే అయితే అల్లాహ్ పై మాత్రమే నమ్మకం ఉంచండి}. (మాఇద 5: 23).**

﴿ وَمَنْ يَتَوَكَّلْ عَلَى اللَّهِ فَهُوَ حَسْبُهُ ﴾ [الطلاق ٣]

**{అల్లాహ్ ను నమ్ముకున్న వానికి అల్లాహ్ యే చాలు}. (తలాఖ్ 65: 3).**

**రగ్బత్, రహబ్, ఖుషూఅ్** యొక్క ఆధారాలు: అల్లాహ్ ఆదేశం

﴿ إِنَّهُمْ كَانُوا يُسَارِعُونَ فِي الْخَيْرَاتِ وَيَدْعُونَنَا رَغَبًا وَرَهَبًا وَكَانُوا لَنَا خَاشِعِينَ ﴾ [الأنبياء ٩٠]

**{వారు మంచి పనుల కోసం ఎక్కువగా శ్రమించే వారు. ఆసక్తితోనూ, భయంతోనూ మమ్మల్ని అర్థించేవారు. మా సమక్షంలో వినమ్రులై ఉండేవారు}. (సూరె అంబియా 21: 90).**

**ఖషియత్** యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశం

﴿ فَلَا تَخْشَوْهُمْ وَاخْشَوْنِي ﴾ (البقرة ١٥٠)

**{వారికి భయపడకండి, నాకు భయపడండి}. (సూరె బఖర 2: 150).**

**ఇనాబత్** యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశం:

﴿ وَأَنِيبُوا إِلَى رَبِّكُمْ وَأَسْلِمُوا لَهُ ﴾ [الزمر ٥٤]

**{మీరు మీ ప్రభువు వైపునకు మరలి ఆయనకు విధేయత చూపండి}. (జుమర్ 39:54).**

**ఇస్తిఆనత్** యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశం

﴿إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ﴾ (الفاتحة ٥)

**{మేము నిన్నే ఆరాధిస్తున్నాము. సహాయం కొరకు నిన్నే అర్థిస్తున్నాము}. (ఫాతిహా 1: 5).** ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారుః

(إذَا اسْعَنتَ فَاسْتَعِنْ بِالله)

**"నీవు సహాయం అర్థించునప్పుడు కేవలం అల్లాహ్ తో మాత్రమే సహాయం అర్థించు". (తిర్మిజి 2516).**

**ఇస్తిఆజ** యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశం

﴿قُلْ أَعُوذُ بِرَبِّ النَّاسِ﴾ [الناس ١]

**{నేను ప్రజల ప్రభువుతో శరణు కోరుతున్నాను అని చెప్పండి}. (నాస్ 114:1).**

**ఇస్తిఘాస** యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశం

﴿إِذْ تَسْتَغِيثُونَ رَبَّكُمْ فَاسْتَجَابَ لَكُمْ﴾ [الأنفال ٩]

**{మీరు మీ ప్రభువును మొరపెట్టుకున్న సందర్భాన్ని (జ్ఞాపకం తెచ్చుకోండి) ఆయన మీకు సమాధాన మిచ్చాడు}. (అన్ఫాల్ 8: 9).**

**జిబహ్** యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశం

﴿قُلْ إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ (١٦٢) لَا شَرِيكَ لَهُ وَبِذَلِكَ أُمِرْتُ وَأَنَا أَوَّلُ الْمُسْلِمِينَ﴾ [الأنعام ١٦٢-١٦٣]

**{ఇలా చెప్పండి: నా నమాజ్, నా సకల ఖుర్బానీ (జిబహ్), నా జీవనం, నా మరణం సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు ఏ భాగస్వామీ లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడింది. అందరికంటే ముందు విధేయతతో తలవంచేవాణ్ణి (ముస్లింని) నేనే}. (అన్ఆమ్ 6: 162, 163).**

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు:

**(لَعَنَ اللهُ مَنْ ذَبَحَ لِغَيْرِ الله).**

**"అల్లాహ్ యేతరుల కొరకు జిబహ్ చేసిన వారిని అల్లాహ్ శపించాడు".** (ముస్లిం 163).

**నజర్** యొక్క ఆధారం: అల్లాహ్ ఆదేశం

**﴿يُوفُونَ بِالنَّذْرِ وَيَخَافُونَ يَوْمًا كَانَ شَرُّهُ مُسْتَطِيرًا﴾**

**{మొక్కుబడి చెల్లించేవారు, నలువైపుల నుండి ఆపదలు కమ్ముకొని వచ్చే దినానికి భయపడే వారు}. (దహర్ 76: 7).**

చివరికి అలవాటుగా చేసే పనులు వాటి ఉద్దేశం అల్లాహ్ విధేయతకు తోడ్పడాలని ఉంటే ఆరాధనలో లెక్కించబడతాయి, ఉదా: నిద్రించుట, తినుట, త్రాగుట, సంపాదించుట, వివాహం లాంటి తదితర అలవాట్లు సదుద్దేశ్యంతో చేస్తే అవి కూడా ఆరాధనల్లో పరిగణించబడతాయి. వాటి పుణ్యం ముస్లింకు లభిస్తుంది.

2- అల్లాహ్ పై విశ్వాసములో మరొకటి ఆయన తన దాసులపై విధిగా నిర్ణయించిన ఐదు ఇస్లాం మూల స్థంబాలను విశ్వసించుట. అవి: (1) అల్లాహ్ మాత్రమే వాస్తవ ఆరాధ్యుడు మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ యొక్క ప్రవక్త అని విశ్వసించుట. (2) నమాజు స్థాపించుట. (3) జకాత్ (విధి దానం) చెల్లించుట. (4) రమజాను మాసములో రోజా (ఉపవాసము) ఉండుట. (5) మక్కా యాత్ర చేయు శక్తి గలవాడు హజ్ చేయుట. వీటితో పాటు ఇస్లాం ధర్మం యొక్క ఇతర విధులను కూడా నమ్మాలి, ఆచరించాలి.

3- అల్లాహ్ పై విశ్వాసంలో మరొకటి అల్లాహ్ యే సర్వలోకాల సృష్టికర్త, తనిష్టానుసారం తన శక్తి మరియు జ్ఞానముతో సర్వ కార్యాలు

నిర్వహించువాడు. ఇహపరలోకాల అధికారి. ఆయనే సర్వలోకాల పోషకుడు. ఆయన తప్ప మరెవ్వడు సృష్టికర్తనూ లేడు. పోషకుడునూ లేడు. ఆయన తన దాసులకు సన్మార్గం చూపుటకు, వారిని వారి ఇహపరాల సాఫల్యం వైపునకు పిలుచుటకు ప్రవక్తలను పంపి, గ్రంథాలను అవతరింపజేశాడు. ఆయన పరమ పవిత్రుడు, అద్వితీయుడు, ఆయనకు సాటి ఎవ్వరూ లేరు.

﴿اللَّهُ خَالِقُ كُلِّ شَيْءٍ وَهُوَ عَلَى كُلِّ شَيْءٍ وَكِيلٌ﴾

**{ప్రతి వస్తువును సృష్టించినవాడు అల్లాహ్ యే. ప్రతి వస్తువునకూ సంరక్షకుడు కూడా ఆయనే}. (సూరె జుమర్ 39: 62).**

4- ఆయన పై విశ్వాసములో మరొకటిః దివ్య ఖుర్ఆనులో మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హదీసుల్లో అల్లాహ్ పవిత్ర నామములు, ఉత్తమ గుణాలు ఏ రీతిలో తెలుపబడ్డాయో అదే రీతిలో ఏ మాత్రం 'తహ్రీఫ్', 'తఅ్తీల్', 'తక్ యీఫ్', 'తమ్సీల్'(2) లేకుండా విశ్వసించాలి. ఆ పవిత్ర నామముల భావము ద్వారా తెలిసిన గుణములను మానవుల గుణాలతో పోల్చకుండా విశ్వసించాలి. సూర షూరా 42:11లో చదవండి:

﴿لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ وَهُوَ السَّمِيعُ الْبَصِيرُ﴾ [الشورى ١١]

**{ఆయనను పోలిన వస్తువు సృష్టిలో ఏదీ లేదు. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ చూసేవాడూను}.**

## 2- అల్లాహ్ దూతలపై విశ్వాసం:

ఒక ముస్లిం సంక్షిప్త రూపంలో అల్లాహ్ దూతలను గురించి ఇలా విశ్వసించాలి: వారిని అల్లాహ్ పుట్టించాడు. వారి స్వభావంలోనే విధేయత వ్రాసాడు. వారిలో అనేకనేక రకాలు గలవు. 'అర్ష్' (అల్లాహ్

2 వీటి వివరాలు 9వ పేజి పాదసూచికలో చూడండి.

సింహాసనము)ను మోసే వారు, స్వర్గనరక భటులు, మానవుల కర్మములను భద్రపరుచువారు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎవరి పేర్లతో సహా ఏ వివరం తెలిపారో అలాగే వారిని విశ్వసించాలి. ఉదాః జిబ్రీల్, మీకాఈల్, నరక పాలకుడు మాలిక్, శంకు ఊదే బాధ్యత కలిగి ఉన్న ఇస్రాఫీల్. అల్లాహ్ వారిని కాంతితో పుట్టించాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారని, ఆయిషా రజియల్లాహు అన్హా ఉల్లేఖించారుః

**(خُلِقَتْ الْمَلاَئِكَةُ مِنْ نُورٍ وَخُلِقَ الْجَانُّ مِنْ مَارِجٍ مِنْ نَارٍ وَخُلِقَ آدَمُ مِمَّا وُصِفَ لَكُمْ)**

**"అల్లాహ్ దూతలు నూర్ (కాంతి)తో పుట్టించ బడ్డారు. జిన్నాతులు అగ్ని జ్వాలలతో మరియు ఆదము ముందే మీకు ప్రస్తావించ బడిన దానితో (మట్టితో) పుట్టించబడ్డారు". (ముస్లిం 2996).**

## 3- గ్రంథములపై విశ్వాసం:

గ్రంథములపై సంక్షిప్తంగా ఇలా విశ్వసించుట విధిగా ఉందిః ప్రవక్తలు తమ తమ జాతులకు ధర్మం బోధించుటకు, వారిని దాని వైపునకు పిలుచుటకు అల్లాహ్ వారిపై (ప్రవక్తలపై) గ్రంథాల్ని అవతరింపజేశాడు. అల్లాహ్ ఏ గ్రంథముల పేరుతో సహా తెలిపాడో వాటిని వివరంగా విశ్వసించాలి. ఉదాః ప్రవక్త మూసా అలైహిస్సలాంపై 'తౌరాత్', ప్రవక్త దావూద్ అలైహిస్సలాంపై 'జబూర్', ప్రవక్త యేసు మస్ీహ అలైహిస్సలాంపై 'ఇంజీల్' మరియు అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై 'దివ్య ఖుర్ఆన్'లు అవతరించాయి. అన్నిట్లో ఖుర్ఆన్ అతిగొప్పది మరియు చిట్టచివరిది. అది పూర్వ గ్రంథాలను రుజువు పరుచునది మరియు పరిరక్షించునది. దానిని అనుసరించుట, దాని ద్వారా మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహీహ్ హదీసుల

ద్వారా తీర్పులు చేయుట తప్పనిసరి. ఎందుకనగా అల్లాహ్, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇరుజాతుల (మానవులు, జిన్నాతుల) వైపునకు ప్రవక్తగా పంపాడు. ఆయనపై ఈ దివ్య ఖుర్ఆనును అవతరింపజేశాడు, ఆయన (ప్రవక్త) దాని ద్వారా వారి మధ్య తీర్పు చేయుటకు. ఇంకా దానిని హృదయ వ్యాధులకు స్వస్థతగా చేశాడు. అది ప్రతి విషయాన్ని స్పష్టంగా వివరిస్తుంది. ఇంకా అది సర్వ లోకాల కొరకు సన్మార్గం, కారుణ్యం. అల్లాహ్ ఆదేశాలు చదవండి:

﴿ وَهَذَا كِتَابٌ أَنْزَلْنَاهُ مُبَارَكٌ فَاتَّبِعُوهُ وَاتَّقُوا لَعَلَّكُمْ تُرْحَمُونَ ﴾ [الأنعام ١٥٥]

**{మేము ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము. ఇది శుభాలుగల గ్రంథం. కావున మీరు దీనిని అనుసరించండి. భయభక్తుల వైఖరిని అవలంబించండి. తద్వారా మీరు కరుణింపబడవచ్చు}. (సూరె అన్ఆమ్ 6: 155).**

﴿ وَنَزَّلْنَا عَلَيْكَ الْكِتَابَ تِبْيَانًا لِكُلِّ شَيْءٍ وَهُدًى وَرَحْمَةً وَبُشْرَى لِلْمُسْلِمِينَ ﴾ [النحل: ٨٩]

**{మేము ఈ గ్రంథాన్ని నీపై అవతరింపజేశాము. అది ప్రతి విషయాన్ని స్పష్టంగా వివరిస్తుంది. విధేయులైన వారికి అది ఉపదేశం, కారుణ్యం, శుభవార్త}. (నహ్ల 16: 89).**

## 4- ప్రవక్తలపై విశ్వాసం:

ప్రవక్తలపై సంక్షిప్తంగా ఇలా విశ్వసించాలిః అల్లాహ్ తన దాసుల వైపునకు ప్రవక్తల్ని శుభవార్త ఇచ్చువారిగా, హెచ్చరించువారిగా, ధర్మం వైపునకు పిలుచువారిగా జేసి పంపాడు.

﴿ وَلَقَدْ بَعَثْنَا فِي كُلِّ أُمَّةٍ رَسُولًا أَنِ اعْبُدُوا اللَّهَ وَاجْتَنِبُوا الطَّاغُوتَ ﴾ [النحل ٣٦]

**{మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము: 'అల్లాహ్ ను ఆరాధించండి. మిథ్యా**

**దైవాల ఆరాధనకు దూరంగా ఉండండి'}. (నహ్ల 16: 36).**

ప్రవక్తల్ని విశ్వసించినవారే సాఫల్యం పొందువారు. వారిని తిరస్కరించినవారే నష్టం, అవమానం పాలయ్యేవారు.

ప్రవక్తలందరి పిలుపు ఒక్కటేనని మనం విశ్వసించాలి. అది అల్లాహ్ ఏకత్వం మరియు సర్వ ఆరాధనల్లో ఆయన్ని అద్వితీయునిగా నమ్మటం. అయితే వారికి నొసంగబడిన ధర్మశాస్త్రాలు, ఆదేశాలు, శాసనాలు వేర్వేరు. అల్లాహ్ కొందరికి మరి కొందరిపై ఘనత ప్రసాదించాడు. అందరిలోకెల్లా గొప్ప ఘనతగలవారు మరియు చిట్టచివరి, అంతిమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం. చదవండి అల్లాహ్ ఆదేశాలుః

﴿وَلَقَدْ فَضَّلْنَا بَعْضَ النَّبِيِّينَ عَلَى بَعْضٍ﴾ [الإسراء ٥٥]

**{మేము కొందరు ప్రవక్తలకు మరికొందరు ప్రవక్తల కంటే ఉన్నత స్థానాలను ఇచ్చాము}. (బనీ ఇస్రాఈల్ 17: 55).** మరో చోట ఆదేశించాడుః

﴿مَا كَانَ مُحَمَّدٌ أَبَا أَحَدٍ مِنْ رِجَالِكُمْ وَلَكِنْ رَسُولَ اللَّهِ وَخَاتَمَ النَّبِيِّينَ﴾ [الأحزاب ٤٠]

**{(మానవులారా!) ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రి కారు. కానీ ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త, దైవప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు}. (33: అహ్ జాబ్: 40).**

ఇక ఏ ప్రవక్తల పేర్లతో సహా అల్లాహ్ లేక ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారో వారిని అదే వివరంగా విశ్వసించాలి. ఉదాః నూహ్, హూద్, సాలిహ్, ఇబ్రాహీం, వగైరా ప్రవక్తలు. అల్లాహ్ వారందరిపై అనేకానేక దయాకారుణ్యాలు కురిపించుగాకా! ఆమీన్.

## 5- పరలోక విశ్వాసం:

మరణానంతరం సంభవించే ఏ ఏ విషయాల గురించి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారో అవన్నీ ఇందులోనే వస్తాయి. ఉదా: సమాధి యాతన, పరీక్షలు, శుభాలు, ప్రళయదినం నాటి ఘోర సంఘటనలు, వంతెన, త్రాసు, లెక్క, ప్రతి కర్మ యొక్క ఫలితం, కర్మ పత్రాలు ప్రజల ముందు తెరువబడుట, వారు దాన్ని కుడి లేక ఎడమ చేతితో లేక వీపు వెనక నుంచి తీసుకొనుట, ఇంకా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు లభించే హౌజె కౌసర్, స్వర్గం, నరకం, విశ్వాసులకు అల్లాహ్ దర్శనం, సంభాషణ. ఇంకా ఖుర్ఆను మరియు సహీహ్ హదీసుల్లో వచ్చిన విషయాలన్నిటినీ విశ్వసించాలి. అవి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త తెలిపిన ప్రకారమే సంభవించునని నమ్మాలి.

## 6- మంచి, చెడు 'తఖ్దీర్' (విధివ్రాత)పై విశ్వాసం:

'తఖ్దీర్'పై విశ్వాసంలో నాలుగు విషయాలు వస్తాయిః

**మొదటిదిః** భూతకాలములో జరిగినది, భవిష్యత్తులో జరగబోయేది సర్వమూ తెలిసినవాడు అల్లాహ్. తన దాసుల పరిస్థితులు సయితం ఆయనకు తెలుసు. ఇంకా వారి జీవనోపాధి, వారి చావు, వారు చేసే కర్మలన్నీ ఎరిగినవాడు ఆయనే. ఆ పరమ పవిత్రునికి వారి ఏ విషయమూ తెలియకుండా లేదు.

﴿إِنَّ اللَّهَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ﴾ [التوبة ١١٥]

**{నిశ్చయముగా అల్లాహ్ కు సర్వమూ తెలియును}. (సూరె తౌబా 9: 115).**

**రెండవదిః** ఆయన సృష్టిలో ఉన్న ప్రతీ దాని విధివ్రాతను వ్రాసి పెట్టాడు.

﴿وَكُلَّ شَيْءٍ أَحْصَيْنَاهُ فِي إِمَامٍ مُبِينٍ﴾ (يس ١٢)

**{ప్రతి విషయాన్నీ మేము ఒక స్పష్టమైన గ్రంథంలో వ్రాసి పెట్టాము}**. (**సూరె యాసీన్ 36: 12**).

**మూడవది:** ప్రతి విషయం అల్లాహ్ ఇష్టముపై ఆధారపడియుంది. ఆయన తలచినది తక్షణమే అవుతుంది. తలచనిది కానే కాదు అని విశ్వసించాలి. అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

﴿ كَذَلِكَ اللَّهُ يَفْعَلُ مَا يَشَاءُ ﴾ [آل عمران ٤٠]

**{అలానే అవుతుంది. అల్లాహ్ తాను కోరినదానిని చేస్తాడు}**. (**ఆలె ఇమ్రాన్ 3:40**).

**నాల్గవది:** అల్లాహ్ దేని తఖ్దీర్ నిర్ణయించాడో అది సంభవించక ముందే దానిని పుట్టించి ఉన్నాడు.

﴿ وَاللَّهُ خَلَقَكُمْ وَمَا تَعْمَلُونَ ﴾ [الصافات ٩٦]

**{వాస్తవానికి అల్లాహ్ యే మిమ్మల్నీ సృష్టించాడు, మీరు చేసేవాటన్నిటినీ సృష్టించాడు}**. (**సూరె సాఫ్ఫాత్ 37: 96**).

## షిర్క్ (బహుదైవారాధన), దాని రకాలు:

**షిర్క్ అంటే:** మనిషి అల్లాహ్ యొక్క రుబూబియత్ లో, లేదా ఉలూహియత్ లో లేదా అస్మా వ సిఫాత్ లో ఇతరులను భాగస్వామిగా చేయుట.

**షిర్క్ రెండు రకాలు:** చిన్న షిర్క్, పెద్ద షిర్క్.

**మొదటిది:** పెద్ద షిర్క్: ఆరాధన యొక్క ఏ ఒక్క రకమైనా అల్లాహ్ యేతరుల కొరకు చేయుట పెద్ద షిర్క్ అవుతుంది. ఈ షిర్క్ చేసిన వ్యక్తి తౌబా చేయకుండా (పశ్చాత్తాప పడి, క్షమాభిక్ష కోరకుండా) చనిపోతే శాశ్వతంగా నరకంలో ఉంటాడు. ఇంకా ఇది సర్వ సత్కార్యాలను నాశనం

చేసేస్తుంది. అంటే ప్రళయదినాన సత్ఫలితం లభించదు. అల్లాహ్ ఆదేశం చదవండిః

﴿ وَلَوْ أَشْرَكُوا لَحَبِطَ عَنْهُمْ مَا كَانُوا يَعْمَلُونَ ﴾ [الأنعام ٨٨]

**{ఒకవేళ వారు షిర్క్ చేసి ఉండినట్లయితే, వారు చేసిన సమస్తం నాశనం అయివుండేది}. (సూరె అన్ఆమ్ 6: 88).**

పెద్ద షిర్క్ ను అల్లాహ్ స్వచ్ఛమైన తౌబా చేయనిదే క్షమించడు. చదవండి ఖుర్ఆన్ సాక్ష్యం:

﴿ إِنَّ اللَّهَ لَا يَغْفِرُ أَنْ يُشْرَكَ بِهِ وَيَغْفِرُ مَا دُونَ ذَلِكَ لِمَنْ يَشَاءُ وَمَنْ يُشْرِكْ بِاللَّهِ فَقَدِ افْتَرَى إِثْمًا عَظِيمًا ﴾ (النساء ٤٨)

**{అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారి కొరకు క్షమిస్తాడు. ఇతరులను అల్లాహ్ కు భాగస్వాములుగా చేసేవాడు, వాస్తవానికి మహా పాపం చేసినవాడు}. (సూరె నిసా 4: 48).**

**పెద్ద షిర్క్ లోని కొన్ని రకాలు:** అల్లాహ్ యేతరులతో దుఆ, అల్లాహ్ యేతరుల కొరకు మొక్కుబడి, జిబహ్ వగైరాలు చేయుట. అల్లాహ్ తో ఇతరుల్ని సాటి కలిపి అల్లాహ్ పట్ల ఉండవలసిన ప్రేమ వారి పట్ల ఉంచుట.

﴿ وَمِنَ النَّاسِ مَنْ يَتَّخِذُ مِنْ دُونِ اللَّهِ أَنْدَادًا يُحِبُّونَهُمْ كَحُبِّ اللَّهِ وَالَّذِينَ آمَنُوا أَشَدُّ حُبًّا لِلَّهِ ﴾

**{కొందరు అల్లాహ్ ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాహ్ పట్ల కలిగి ఉండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు}. (సూరె బఖర 2: 165).**

**రెండవదిః చిన్న షిర్క్:** అంటే: ఖుర్ఆను, హదీసులో ఏ పనుల కొరకు షిర్క్ అనే పేరు వచ్చిందో కాని అవి పెద్ద షిర్క్ వరకు చేరవో వాటినే చిన్న

షిర్క్ అంటారు. ఈ రకం ధర్మభ్రష్టతకు కారణం కాదు. కానీ దీని వల్ల తౌహీదు లో మాత్రం కళంకం, కొరత ఏర్పడుతుంది. ఉదా: ప్రదర్శనాబుద్ధితో ఏదైనా సత్కార్యం చేయుట. లేదా పెద్ద షిర్క్ కు తోడ్పడే ఏదైనా కార్యం. ఉదా: అల్లాహ్ కొరకు చేసే నమాజు ఏదైనా సమాధి వద్ద చేయుట. అల్లాహ్ యేతరులు లాభనష్టానికి అధికారులు కారని నమ్మి కూడా వారి మీద ప్రమాణం చేయుట. ఇంకా అల్లాహ్ మరియు ఫలాన వ్యక్తి తలచినట్లు అని పలుకుట. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారుః

**(إِنَّ أَخْوَفَ مَا أَخَافُ عَلَيْكُمْ الشِّرْكُ الْأَصْغَرُ)** قَالُوا: يَا رَسُولَ الله وَمَا الشِّرْكُ الْأَصْغَرُ؟ قَالَ: **(الرِّيَاءُ)**.

**"మీ పట్ల నాకు అధికంగా భయం కలిగించేదేమిటంటే మీరు చిన్న షిర్క్ కు పాల్పడతారని". చిన్న షిర్క్ అంటేమిటి? ప్రవక్తా అని అడిగారు అక్కడున్నవారు. అప్పుడు ప్రవక్త చెప్పారు: "ప్రదర్శనాబుద్ధి" అని. (ముస్నద్ అహ్మద్. దీని సనద్ ప్రమాణికమైనది).**

**(مَنْ حَلَفَ بِشَيْءٍ دُونَ الله فَقَدْ أَشْرَكَ).**

**"ఎవరైనా అల్లాహ్ తప్ప ఏదాని ప్రమాణం చేసినా అతడు షిర్క్ చేసినట్లు". (ముస్నద్ అహ్మద్. దీని సనద్ ప్రమాణికమైనది).**

తాయత్తులు వేసుకొనుట. రోగాలు, ఆపదలు రాకుండా లేదా వచ్చినా తొలిగిపోవుటకు కడియాలు, రింగులు సాధనం అని వేసుకొనుట లాంటి పనులు చిన్న షిర్క్ కు సంబంధించినవే. ఇక అవి సాధనమే కాదు, అందులో లాభనష్టాలు ఉన్నాయి, అంటే అవి వేసుకున్నప్పుడు లాభం ఉంటుంది వేసుకోకుంటే నష్టం ఉంటుంది అని విశ్వసిస్తే అది పెద్ద షిర్కులో వస్తుంది. (అందుకు చాలా జాగ్రత్తగా ఉండాలి).

# ఫిర్ఖయే నాజియ[3]

ఫిర్ఖయే నాజియ యొక్క విశ్వాసం ఇదిః అల్లాహ్, ఆయనే ప్రభువు, వాస్తవ ఆరాధ్యుడు. ఉత్తమోత్తముడు, దోషరహితుడు అని సత్య విశ్వాసి సాక్ష్యమిస్తాడు. ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకించి ఆ అద్వితీయున్నే ఆరాధిస్తాడు. అల్లాహ్ యే సృష్టివ్యూహాన్ని రచించేవాడు, దానిని అమలు పరచేవాడు, ఆపై దాని ప్రకారం రూప కల్పన చేసేవాడు, ఉపాధి ప్రధాత, ఇచ్చేవాడు, ఆపేవాడు, సర్వ కార్యాల నిర్వహకుడు.

ఆయనే సత్య ఆరాధ్యుడు. ఆయనే ఆరంభము, ఆయనకు ముందు ఏదీ లేదు. ఆయనే అంతము, ఆయన తరువాత ఏదీ లేదు. ఆయనే బాహ్యము, ఆయనపై ఏదీ గెలవలేదు. ఆయనే గూఢము, ఆయనకు తెలియనిది ఏదీ లేదు.

సర్వకాల సర్వావస్థలలో అన్ని విధాలుగా ఆయనే పరమోన్నతుడు, మహోన్నతుడు, గొప్పవాడు. సర్వ సృష్టి పై ఉన్న సింహాసనం (అర్ష్)పై ఆసీనుడైయున్నాడు. పరమ శ్రేష్ఠుడు అన్ని రకాల లోపాల, దోషాలకు అతీతుడు. ఆయనే అందరిపై అధికారం గలవాడు. ఆయన ఆధీనంలో నుండి ఏ ఒక్కడూ తప్పించుకోలేడు.

ఆయన తన ఔన్నత్యం, గౌరవానికి తగిన రీతిలో అర్ష్ పై ఆసీనుడైయున్నాడు. అందరికి పైగా, ఉన్నతముగా ఉన్నప్పటికీ బాహ్యమూ, గూఢమూ, పైలోకం, క్రింది లోకం/ పాతాళం అంతయూ తెలిసినవాడు. ఆయన తన విద్యాజ్ఞానంతో మానవుల వెంట ఉన్నాడు. వారి సర్వ స్థితులను ఎరిగి ఉన్నాడు. ఆయన సమీపములో ఉన్నాడు. (ఆయన్ను ప్రార్థించేవారికి) సమాధానం ఇస్తాడు.

---

3 మోక్షానికి, స్వర్గ ప్రవేశానికి అర్హత గల వారు అని భావం.

ఆయన ఏ అక్కరా లేనివాడు. ప్రజల నుండి ఆయనకి ఏ అవసరమూ లేదు. అందరూ తమ ఉనికి, మరియు తమకు అవసరమున్న ప్రతీ దానికి ఆయన పై ఆధారపడి యున్నారు. క్షణం పాటు / కను రెప్ప పాటు ఏ ఒక్కరూ ఆయన అవసరం లేనిది లేరు. ఆయన కనికరుడు, వాత్సల్యం కలవాడు. ప్రజల వద్ద ఉన్న ధార్మిక వరాలైనా లేదా ఐహిక వరాలైనా అన్నియూ ఆ పరమ పవిత్రుని తరఫునే. ఆయనే వరాలు ప్రసాదించువాడు. ఆపదలను దూరం చేసేవాడు.

ఆయన కారుణ్యమే ఇది: ఆయన ప్రతి రాత్రి మూడవ వంతు రాత్రి మిగిలి ఉండగా ప్రపంచ ఆకాశానికి దిగి వచ్చి "నన్ను అడిగేవారెవరు? అతనికి ప్రసాదిస్తాను. ఎవరు నాతో తన పాపాల మన్నింపు కోరుతాడో నేను అతన్ని క్షమిస్తాను" అని **ఫజ్ర్** వరకు నినదిస్తాడు. అయితే ఆ దిగిరావడం తన ఔన్నత్యం, గౌరవానికి తగిన రీతిలో ఉంటుంది.

సంపూర్ణ వివేకం గల వివేచనా పరుడు ఆయన. ఆయన సృష్టించిన దానిలో ఏ ఒక్కటీ వృధాగా లేదు. ఆయన పంపిన ధర్మాల్లో మేళ్ళు ఉన్నాయి. అన్ని రకాల కీడులకు నివారణ ఉంది.

ఆయన తౌబా అంగీకరించువాడు, మన్నించేవాడు, క్షమించేవాడు. తన దాసుల్లో తౌబా చేసేవారి తౌబాలను అంగీకరిస్తాడు. పాపాల ప్రక్షాళన కోరే వారిని మన్నిస్తాడు. ఆయన వైపుకు మరలినవారి పెద్ద పెద్ద పాపాలను క్షమిస్తాడు.

ఆయన విలువనిచ్చేవాడు. ఓ చిన్న సత్కార్యానికైనా విలువనిస్తాడు. దానికి బదులు అధిక ఫలం నొసంగుతాడు. ఇంకా ఆయనకు కృతజ్ఞుడుగా ఉన్నవారికీ మరిన్ని అనుగ్రహాలు నొసంగుతాడు.

నిజమైన విశ్వాసి అల్లాహ్ తన కొరకు, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ కొరకు తెలిపిన గుణనామాల్ని విశ్వసిస్తాడు. ఉదా:

సంపూర్ణ జీవనం, వినుట, చూచుట. పరమ శక్తి, ఔన్నత్యము, గొప్పతనం, కీర్తి, మహిమాన్వితం, సౌందర్యం, పరిపూర్ణత. సర్వస్తోత్రం. అన్నిటికీ ఆయనే ఏకైక అర్హత గలవాడు.

ఖుర్ఆను మరియు హదీసుల ద్వారా రుజువైనవాటిలో ఒకటి: 'విశ్వాసులు స్వర్గంలో తమ ప్రభువును ప్రత్యక్షంగా చూస్తారు' అనే విషయాన్ని దృఢంగా విశ్వసిస్తాడు. ఆయన దర్శనం మరియు ఆయన సంతృప్తి వరాలు స్వర్గంలో లభించే సర్వ వరాల్లోకెల్లా అతి గొప్పవి.

తౌహీద్, విశ్వాస మార్గాన్ని వదలి చనిపోయినవారు శాశ్వతంగా నరకంలో ఉంటారు. ఘోర పాపాలు (కబీరా గునాహ్) చేసినవారు, తౌబా చేయకుండా చనిపోయి, లేదా వారి ఆ పాపాల మన్నింపు మార్గం లభించకుండా, లేదా సిఫారసు కూడా పొందకుండా ఒకవేళ నరకంలో ప్రవేశించినా అందులో శాశ్వతంగా ఉండరు. తన హృదయంలో రవ్వ గింజంత విశ్వాసం కూడా ఉన్న వ్యక్తి తప్పకుండా ఒక రోజు నరకం నుండి బైటికి వస్తాడు.

హృదయాంతర నమ్మకం, హృదయపు వాచకర్మ అలాగే అవయవాల పనులు, నాలుక మాటలు, ఇవన్నియూ విశ్వాసంలో పరిగణించ బడతాయి. విశ్వాస బాధ్యతల్ని సంపూర్ణంగా నెరవేర్చేవాడే నిజమైన విశ్వాసి. ప్రతిఫలానికి అర్హుడు, శిక్షకు దూరం ఉండువాడు. వాటిలో ఏ కొంత కొరత చూపినా అదే పరిమాణంలో అతనిలో నుండి విశ్వాసం తరుగుతుంది. అలా ఎందుకనగా విశ్వాసం విధేయత, సత్కార్యాలతో పెరుగుతుంది. అవిధేయత, దుష్కార్యాలతో తరుగుతుంది.

అలాగే విశ్వాసి ఈ సాక్ష్యం కూడా ఇస్తాడు: ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ యొక్క దాసుడు మరియు ప్రవక్త. అల్లాహ్ ఆయనకు మార్గదర్శకత్వాన్నీ, సత్య ధర్మాన్నీ ఇచ్చి పంపాడు. దానిని సకల

ధర్మాలపై ఆధిక్యం వహించే ధర్మంగా చేయటానికి. నిస్సందేహంగా ఆయన విశ్వాసులకు స్వయంగా తమకంటే కూడా ముఖ్యుడు. ఆయన ప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చిట్టచివరి ప్రవక్త. అల్లాహ్ వారిని మానవుల, జిన్నాతుల వైపునకు శుభవార్తనిచ్చే వారిగా, హెచ్చరిక చేసేవారిగా, అల్లాహ్ అనుమతితో ఆయన వైపునకు పిలుపునిచ్చేవారిగా చేసి, ప్రకాశించే దీపంగా చేసి పంపాడు. ఇహపరాల మేళ్ళతో ఆయన్ని పంపాడు. మానవులందరూ ఆ ఏకైక, ఏ భాగస్వామి లేని అల్లాహ్ ఆరాధన పై స్థిరంగా ఉండుటకు ఆయన నొసంగే ఉపాధిని, ఆయన ఆరాధన సహాయానికి ఉపయోగించుకోడానికి ఆయన సల్లల్లాహు అలైహి వసల్లంని పంపాడు.

ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం సృష్టిలో అందరికన్నా గొప్ప జ్ఞాని, సత్యవంతుడు, ఉత్తమ సలహాకారుడు. మరియు అందరికన్నా స్పష్టంగా బోధించేవారు అని విశ్వాసి తెలుసుకుంటాడు. ఆయన్ని గౌరవిస్తాడు, ప్రేమిస్తాడు. సర్వ సృష్టి ప్రేమ పై ఆయన ప్రేమకు ఆధిక్యతనిస్తాడు. ఆయన తీసుకొచ్చిన ధర్మం యొక్క మూల విషయాలను మరియు వాటి వివరాలన్నిటినీ అనుసరిస్తాడు. ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం మాట, పద్ధతికి ఇతరుల మాట, పద్ధతిపై ప్రాధాన్యతనిస్తాడు.

అల్లాహ్ ఆయనకు నొసంగిన ఘనతలు, ప్రత్యేకతలు, పరిపక్వతలు సృష్టిలో ఏ ఒక్కరికీ నొసంగ లేదని విశ్వాసి నమ్ముతాడు. సృష్టిలోకెల్లా ఉన్నత స్థానం గలవారు, గొప్ప కీర్తి గలవారు, ప్రతీ దాంట్లో ఉన్నత, ఉత్తమ స్థాయిగలవారు ఆయనే సల్లల్లాహు అలైహి వసల్లం. ఆయన తెలుపనిది ఏ మేలు అంటూ లేదు. ఆయన నివారించనిది అంటూ ఏ చెడు లేదు.

విశ్వాసి అల్లాహ్ అవతరింపజేసిన ప్రతి గ్రంథాన్ని, పంపిన ప్రతి ప్రవక్తను నమ్ముతాడు. వాటి / వారి వివరాలు తెలిసినా, తెలియక పోయినా. ఏ ఒక్కరిపై విశ్వాసంలో భేదభావం చూపడు. వారందరికీ

ఇవ్వబడిన సందేశం ఒక్కటని నమ్ముతాడు. అదే: ఆ ఏకైక, ఏ భాగస్వామిలేని అల్లాహ్ ను ఆరాధించడం.

మంచి, చెడు విధివ్రాతను తూ.ఛ. తప్పకుండా నమ్ముతాడు. మానవుల మంచి, చెడు కర్మలన్నిటి గురించి అల్లాహ్ కు చాలా క్షుణ్ణంగా తెలుసు. అల్లాహ్ కలము వాటిని ముందే వ్రాసేసింది. వాటిలో అల్లాహ్ తలంపు వెడలింది. వాటిలో అల్లాహ్ వివేకం తప్పక ఉంది. తన దాసులకు శక్తి మరియు ఉద్దేశ్యం ప్రసాదించాడు. వారి శక్తి, కోరిక ప్రకారమే వారి నుండి మాటలు, చేష్టలు వెలువడుతాయి. అల్లాహ్ ఏ దాని గురించి వారిపై ఏ రకమైన ఒత్తిడి చేయలేదు. వారికి స్వయంగా అధికారం ఇచ్చాడు. అల్లాహ్ తన న్యాయం, వివేకంతో విశ్వాసులకు ప్రత్యేకంగా నొసంగిన వరం ఇదిః వారిలో విశ్వాసం పట్ల ప్రేమను కలగజేశాడు. దానిని వారికి ఇష్టమైనదిగా చేశాడు. అవిశ్వాసం, దుర్మార్గం, అవిధేయతల పట్ల వెగటు కలగ జేశాడు.

విశ్వాసి ఎల్లప్పుడూ శ్రేయోభిలాషిగా ఉండాలి. ఈ శ్రేయోభిలాష అల్లాహ్ పట్ల, ఆయన గ్రంథం పట్ల, ఆయన ప్రవక్త పట్ల, మరియు మస్లిముల నాయకుని పట్ల మరియు వారి సామాన్య ప్రజల పట్ల. షరీఅత్ పరిధిలో ఉండి మంచిని ఆదేశించాలి.

చెడును నివారించాలి. తల్లిదండ్రులకు విధేయులుగా ఉండాలి. రక్త సంబంధాల్ని పెంచుకోవాలి. బంధువులకు, పొరుగువారికి, హక్కుగలవారికి, అందరికీ ఉపకారము చేయాలి. అందరితో సత్సంబంధాలుంచుకోవాలి. సద్వర్తన ప్రచారం చేయాలి. దుష్ప్రవర్తన రూపు మాపాలి.

విశ్వాసుల్లో సంపూర్ణ విశ్వాసం గలవాడు వారిలో అందరి కన్నా మంచి సత్కార్యాలు, సత్ప్రవర్తనలు గలవాడు. వారిలో అందరికంటే ఎక్కువ

సత్యసంధుడు, ప్రతి మంచికి అందరికంటే ఎక్కువ దగ్గరిగా, చెడుకు దూరంగా ఉన్నవాడు అని నమ్మాలి.

అల్లాహ్ మార్గంలో జిహాద్ ప్రళయం వరకు ఉండునని తెలుసుకోవాలి. అది ఇస్లాం ధర్మం యొక్క శిఖరం. అది విద్య ద్వారా, ఆధారం, నిదర్శనాల ద్వారా మరియు ఆయుధాల ద్వారా జరుగుతూ ఉండును. తన ధర్మం వైపు నుండి తన శక్తి ప్రకారం పోరాడుట ప్రతి ముస్లింపై విధిగా ఉంది. దానికి తగిన షరతులు, సాధనాలు పూర్తయినప్పుడు, నాయకుడు పుణ్యాత్ముడైనా, పాపాత్ముడైనా అతని వెంట ఉండి జిహాద్ చేయాలి.

ముస్లిములందరు ఏకత్రాటిగా ఉండేందుకు అధికంగా కాంక్షించాలి. అందుకు పరస్పరం ప్రోత్సహించాలి. వారిని కలపడానికి, వారి మనస్సులు పరస్పరం చేరువుగా కావడానికి పూర్తి ప్రయత్నం చేయాలి. విభేదం, పరస్పర శత్రుత్వం, కపటాలకు దూరంగా ఉండాలి. అలా ఉన్నవారిని హెచ్చరించాలి. ఐక్యమత్యానికి తోడ్పడే, విభేదాలను దూరం చేసే యోగ్యమైన ప్రతి సాధనాన్ని అవలంభించాలి. ప్రజలకు ఏ రకమైన హాని కలిగించవద్దు. అది వారి ప్రాణ, ధన, మాన సంబంధమైన లేదా మరే రకమైన హక్కులో గాని. ముస్లిములతో, ముస్లిమేతరులతో వారి వ్యవహారాల్లో న్యాయం పాటించాలి. దీని గురించే ఇతరులకు బోధించాలి.

సర్వ అనుచర సంఘాల్లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచర సంఘం అతిఉత్తమమైనదని విశ్వసించాలి. అందులో ప్రవక్త సహచరులు, ప్రత్యేకంగా ఖులఫాఏ రాషిదీన్, స్వర్గ శుభవార్త పొందిన పది సహచరులు, **బద్ర్** యుద్ధ వీరులు, (హుదైబియాలో) రిజ్వాన్ శపథంలో పాల్గొన్నవారు, ముహాజిరీన్, అన్సారులో (విశ్వాస సందేశాన్ని స్వీకరించటానికి) ముందంజం వేసినవారు ఘనులు, శ్రేష్ఠులు. ప్రవక్త

సహచరులను ప్రేమించాలి. దీన్ని కూడా అల్లాహ్ యొక్క ధర్మంగా భావించాలి. వారి సద్గుణాలను ప్రచారం చేయాలి. వారి గురించి లేపబడుతున్న అపోహాలు విన్నప్పుడు వాటిని ఆపాలి, లేదా మౌనం వహించాలి.

ధర్మవేత్తలను, ధర్మ నాయకులు మరియు ముస్లిములలో ధర్మపరంగా ఉన్నత స్థానంలో ఉన్నవారిని గౌరవించాలి. దీన్ని కూడా ధర్మంగా భావించాలి. అల్లాహ్ వారిని అనుమానం, షిర్క్, విభేదం, కపటం, దుర్గుణాల నుండి కాపాడాలని, జీవితాంతం సవ్యమైన ధర్మంపై స్థిరంగా ఉంచాలని అల్లాహ్ ను అర్థించాలి.

ఫిర్ఖయే నాజియ అనుయాయులు అనుసరించే మౌలిక విషయాలు ఇవే.

వీటి వైపునకే వారు ఇతరులను ఆహ్వానిస్తారు.